బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా లేరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ ఒక్క వర్గానికి సంతృప్తికరంగా లేదు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్ లేదు. ఒక్క పథకం మీద కూడా స్పష్టమైన భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది. ప్రత్యేకంగా ఒక్క కొత్త పథకాన్ని ప్రవేశపెట్టలేదు. రైతుల సంక్షేమం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా కనిపించలేదు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. బడ్జెట్‌లో రూ.4 వేల పింఛన్ ప్రస్తావన లేకపోవడం దుర దృష్టకరం. నిరుద్యోగ భృతి ఊసే లేదు. నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, కర్షకులను నిరుత్సాహ పరిచే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది.

- కోంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకులు, మొయినాబాద్

పేదలకు ఉపయోగం లేని బడ్జెట్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేద ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్ సమయంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించింది. ఆరు గ్యారంటీల అమలు తీరును బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం ప్రస్తావించకపోవడం దారుణం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా కనిపించడం లేదు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్ల అభివృద్ధికి పెద్దగా నిధులు కేటాయించినట్లుగా లేదు. ఏ ఒక్క వర్గానికి సంతృప్తికరంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లుగా లేదు.ప్రభుత్వం బడ్జెట్ అంకెల గారడిగా ఉంది.

- కందాడి లక్ష్మారెడ్డి, రాగన్నగూడ మాజీ సర్పంచ్

అన్ని రంగాలకు అన్యాయమే..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు అన్యాయమే జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చేప్పుకోవడం తప్ప రాష్ట్ర ప్రజల కోసం చేసింది ఏమి లేదు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను చూస్తుంటే ముఖ్యమంతి, మంత్రుల పనితీరు రానున్న రోజుల్లో ఎలా ఉండబోతోందో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు ఎలా ఉండబోతున్నాయో ఇప్పుడే అర్థం అవుతుంది. గత ప్రభుత్వం ప్రతి పేద కుటుంబంలో ఉన్న విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే ఆలోచనతో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసింది. కానీ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయి, సొంత భవనాలకు కూడా నిధులు ఇవ్వలేదు. అధికారంలోకి రాక ముందు ప్రజలను మభ్యపెట్టి ఇప్పుడు బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను నిరాశపరిచింది.

- ఈట గణేశ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్

షాద్‌నగర్ పట్టణంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూలై25: రైతుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించే విధంగా చొరవచూపాలని అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు రుణమాఫీ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9లోపు రుణాలను పొందిన అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ పథకాన్ని వర్తింపచేయాలని కోరారు. లబ్ధిదారుల జాబితాల్లో ఎలాంటి తప్పులు ఉన్నా సవరించి రైతుల పక్షాన పనిచేయాలని చెప్పారు. ఆయా బ్యాంక్‌లో రుణం పొందిన రైతులు తమకు రుణమాఫీ వస్తుందో ? రాదో అనే సందేహంలో ఉన్నారని, రుణమాఫీ పొందేందుకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 13 వేల 468 మంది రైతులకు మొదటి విడుతలో లక్ష లోపు రుణాలకు మాఫీ వర్తిస్తుందని, విడతల వారీగా 2 లక్షల వరకు రుణాలను పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ కింద నిధులు అందుతాయని చెప్పారు. సమావేశంలో ఏడీఏ రాజారత్నం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెదడు వాపు వ్యాధి నిర్మూలనకు చర్యలు

యాచారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీకా వేస్తున్న వైద్యులు

యాచారం, జూలై25: మెదడు వాపు వ్యాధిని అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు మండల వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెదడు వాపు నివారణకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ..ఈనెల 25నుంచి ఆగస్టు 29వరకు 9నెలల నుంచి 15సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు మెదడు వాపు నివారణ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. వంద శాతం టీకాను వేసేందుకు ఏఎన్ఎంలు దృష్టి సారించాలన్నారు. మొదటి రోజు యాచారంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు టీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలకు చెందిన 686మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అనైతికం

షాద్‌గనర్ సీడీపీవో నాగమణి

సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

కొత్తూరు, జూలై 25: మానవ అక్రమ రవాణా అనైతికమని, నేరమని షాద్‌గనర్ సీడీపీవో నాగమణి అన్నారు. రెండు రోజుల అంగన్‌వాడీ టీచర్ల శిక్షణా శిబిరాన్ని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆ సంస్థ మేనేజర్ బాలకృష్ణ, సీడీపీవో నాగమణి హాజరై మాట్లాడారు. ప్రతి రోజూ ఎంతో మందిని అక్రమ రవాణా చేస్తున్నారని వాపోయారు. మహిళల అక్రమ రవాణపై సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సఖీ సెంటర్ అధికారి మంజుల ప్రత్యేక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, లక్ష్మీబాయి, సిబ్బంది అనిల్‌కుమార్, మిథాలిరాజ్, నాగలక్ష్మి, రజిని, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, నాగలక్ష్మి, రజిని పాల్గొన్నారు.

మంగళ సూత్రం చోరీకి యత్నం

ప్రతిఘటించిన మహిళ.. పారిపోయిన దుండగుడు

కొత్తూరు, జూలై 25: మంగళసూత్రం ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఇద్దరు దొంగలను ఓ మహిళ ప్రతిఘటించిన ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. ఖాజిగూడకు చెందిన కొడావత్ మంజుల తన ఇంట్లో కిరాణ దుకాణం నిర్వహిస్తుంది. గురువారం ఉదయం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. మంజుల లేవని చెప్పింది. వెళ్లిపోయిన వ్యక్తులు తిరిగి వచ్చి ఏ సిగరెట్ ఉన్నా ఇవ్వాలని కోరగా, సామగ్రి తీసుకొని మొత్తం రూ.32 పేటీఎం చేసి వెళ్లి పోయారు. అయితే రెండు నిమిషాల తర్వాత వచ్చి 2 బిస్కెట్ ప్యాకెట్ల కావాలని రూ. 10 పేటీఎం చేశారు. దీంతో మంజుల సరే అని బిస్కెట్లు ఇచ్చే ప్రయత్నంలో ఉండగా, ఆ ఇద్దరిలో ఒకరు బైక్‌పై రాగా, ఇంకొకరు పుస్తెల తాడు తెంపే ప్రయత్నం చేశాడు. వెంటనే తేరుకున్న మంజుల గట్టిగా అరుస్తూ వారిని పట్టుకునే ప్రయత్నం చేయడంతో మంగళసూత్రాన్ని వదిలి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరసింహారావు తెలిపారు.

విచ్చలవిడిగా వీధికుక్కల సంచారం

పది రోజుల్లో 15 మందిపై దాడి

కుక్కల బెడదను నివారించాలని కమిషనర్‌కు వినతి

ఇబ్రహీంపట్నం, జూలై 25: మున్సిపాలిటీలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని పలు కాలనీల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో రోజురోజుకూ వీధికుక్కల బెడద తీవ్రమవుతున్నది. గత పది రోజుల నుంచి మున్సిపాలిటీ పరిధిలో సుమారు పది నుంచి 15 మందిపై దాడిచేసి గాయపర్చాయి. చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వీధి కుక్కల దాడిలో గాయపడినవారు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇబ్రహీంపట్నంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వీధి కుక్కలబారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం నాయకులు శామ్యేల్, జంగయ్య తదితరులు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌ను కోరారు.

ఇద్దరిపై వీధి కుక్కల దాడి

షాద్‌నగర్ : గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల దాడి రోజురోజుకూ పెరిగిపోతున్నది. వీధుల్లో విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తూ పాదచారులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. కొందుర్గు మండల కేంద్రంలో బుధవారం రాత్రి కూరగాయలను కొనుగోలు చేసేందుకు రోడ్డుపైకి వచ్చిన గురురాజన్ పై ఒక్కసారిగా కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయని, అదేవిధంగా ఆటో దిగి ఇంటికి వెళ్తున్న ముత్యాలమ్మపై దాడిచేసి గాయపర్చాయి. వీరితో పాటు మరో ముగ్గురిపై దాడి చేశాయని స్థానికులు తెలిపారు. కొందుర్గులో కుక్కల స్వైర విహారం పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నియంత్రించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఇబ్రహీంపట్నంలోని బృందావన్‌నగర్ కాలనీలో వీధి కుక్కలు

బోనం.. ఘనం

- భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి బోనాలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

షాద్‌నగర్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, జూలై 25: షాద్‌నగర్ పట్టణంలో పోచమ్మతల్లి బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం మహిళలు, యువతులు బోనాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పటేల్ రోడ్డు, నెహ్రూనగర్, వెంకటేశ్వర, భాగ్యనగర్, పద్మావతి, రతన్‌కాలనీ, తిరుమల, శ్రీనగర్‌కాలనీలో పోతరాజుల విన్యాసాలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పటేల్‌రోడ్డు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల అమ్మవారి వేషధారణ విన్యాసాలు ఆకర్షణీయంగా నిలిచింది. అనంతరం తొట్టెలను ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు ఎజాజ్ పాల్గొన్నారు.

షాబాద్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బోనాల ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. గురువారం మండలంలోని సర్దార్‌నగర్, కుర్వగూడ, తిమ్మారెడ్డిగూడ, పెద్దవేడు తదితర గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో పూజలు చేసి సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు స్వరూప, నర్సింహులు, సంధ్య, శకుంతల, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు వనిత, సునీత, పాండు, జయమ్మ పాల్గొన్నారు.

ముడిమ్యాల్ గ్రామంలో..

చేవెళ్ల రూరల్ : ముడిమ్యాల్ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గురువారం పోతరాజుల విన్యాసాలు, డబ్బు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, గ్రామస్తులు రాములు, రాహుల్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, శేరి రాజు, సాయినాథ్, శ్రీనివాస్‌గౌడ్, సాయిబాబా, శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీకాంత్, శివకుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : ముడిమ్యాల్ గ్రామంలో బోనాల ఉత్సవాల్లో మహిళలు, నేతలు

షాబాద్ మండలం కుర్వగూడలో బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యసాలు

కేంద్ర మంత్రికి వినతి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు

ఆమనగల్లు, జూలై 25: తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరు లేన్ల రహదారులను నిర్మించాలని, కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు నాలుగు లేన్ల రహదారి మంజూరు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్ల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం అందజేశారు.

నందిగామలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న మాజీ ఎంపీటీసీ కృష్ణ

రోడ్డుకు మరమ్మతులు

నందిగామ, జూలై 25 : నందిగామ గ్రామం నుంచి పోచమ్మ దేవాలయం వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నందిగామ మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ స్పందించి సొంత ఖర్చులతో గురువారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

కొంగరకలాన్‌లో పర్యటించిన చైర్మన్

మురుగు నీరు తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల, జూలై 25: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో పర్యటించి ప్రజలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో ఏర్పడిన సమస్యలు ఆయన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి గ్రామంలో ఇండ్ల మధ్యలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షం నీరు తొలగించడానికి వెంటనే మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కొంగరకలాన్ గ్రామంలో వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న 17 ఇండ్లను మున్సిపల్ అధికారులు గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాలలో నిలుస్తున్న వర్షం నీటిని తొలగించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. పాఠశాలలో టాయిలెట్స్ సమస్యను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కొంగరతండాలో చైర్మన్ పర్యటించారు. అవసరమైన చోట వెంటనే అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు శ్రీను, మహేందర్, నాగేశ్, అధికారులు ఏఈ వీరాంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

యాచారం, జూలై25: మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, నానక్‌నగర్, తాటిపర్తి, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. చౌదర్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభకు హాజరై గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. మేడిపల్లిలో పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వెనకాల డ్రైనేజీని పరిశీలించి పనులను పూర్తి చేయాలని సూచించారు. మల్కీజ్‌గూడ నానక్‌నగర్, తాటిపర్తి, నజ్దిక్‌సంగారం, కుర్మిద్ద గ్రామాల్లో వనమహోత్సవం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం కింద నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. పంచాయతీ రికార్డులను పక్కాగా అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లిలో పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, జూలై 25: మండల కేంద్రానికి చెందిన కూకుట్ల అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ గురువారం స్థానిక నాయకులతో కలిసి అంజమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాధాకృష్ణ ట్రస్ట్ తరుపున రూ.5 వేలు, ఎర్రోళ్ల రాఘవేందర్ రూ.3 వేలు అందజేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ట్రైనీ కానిస్టేబుల్ మంకాల శివగౌడ్ అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్, సేవ్యానాయక్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాంనాయక్, శంకర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ నాయకులు భాస్కర్ రెడ్డి, లాయక్‌అలీ, నర్సింహా ఉన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

ఇబ్రహీంపట్నం, జూలై25: వనమహోత్సవం ద్వారా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు అన్నారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై హెచ్ఎండీఏ సహకారంతో పట్టణ సుందరీకరణలో భాగంగా డివైడర్‌పై మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చెరువు కట్టపై విరివిగా మొక్కలు నాటి పచ్చదనంతో పాటుగా ఆహ్లాదాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్రసాగర్, వైస్‌చైర్మన్ మంగ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఆమనగల్లు, జూలై 25: పంచాయతీ కార్మికులకు 7నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు, సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు మాట్లాడుతూ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం రూ.20 లక్షలు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పి.ఎఫ్, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా పంచాయతీ సిబ్బంది అందరికీ రిటర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు పెండింగ్ జీతాలకు నిరసనగా గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి భిక్షాటన చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు ఎన్. పాండు, మండల కోశాధికారి లక్ష్మణ్, కార్మికులు గోపాల్, డోలీ, పీప్లీ, చక్రి, శాంతి, నీల, ఆశీర్వాదం పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న కార్మికులు, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నర్సింహాగౌడ్

కొత్తూరు, జూలై 25: ప్రతి ఒక్కరూ ఒక మొక్కలు నాటాలని కౌన్సిలర్ మాదారం నర్సింహాగౌడ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని 9వ వార్డులో కౌన్సిలర్ మాదారం నర్సింహాగౌడ్ తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా గురువారం ఇంటింటికీ సీడ్ మొక్కలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, విజయ్, అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, మహిళా సంఘం సభ్యులు మాదారం హైమావతి, స్వరూప, జాంగీర్ బి, తస్లీమ్, కాలనీ వాసులు సత్యనారాయణగౌడ్, సుదర్శన్‌చారి పాల్గొన్నారు.